ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

శనివారం 23 నవంబరు 2024



కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవంలో భాగంగా శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలో శివలింగం, స్వస్తిక్ ఆకారంలో పూలు, ప్రమిదలు అలంకరించి పూజానంతరం జ్యోతులు వెలిగించారు.

న్యూస్ బాక్స్

హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తిరుపతిరెడ్డి

- వైస్‌చైర్మన్‌గా బంక చందు



తిరుపతిరెడ్డి



బంక చందు

హుస్నాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన కంది తిరుపతిరెడ్డిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్‌చైర్మన్‌గా హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన బంక చందు, డైరెక్టర్లుగా బోడిగ పరశురాములు, పత్తిపాక త్రిమూర్తి, ఓరుగంటి భారతిదేవి, పోతుగంటి బాలయ్య, మహ్మద్ కుతుబుద్దీన్, బొంగొని శ్రీనివాస్, లావుడ్యా బిక్యా, మడప యాదవరెడ్డి, కరొంటుతు రవి, భైకని శ్రీనివాస్, తేరాల మారుతి, తనుకు అంజనేయులను నియమించారు. తమను నియమించడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడదీయడం సరికాదు

- జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

7

ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- డీసీవో నాగేశ్వరరావు

8

మల్లన్నసాగర్‌పై సస్పెన్స్

- మున్సిపాలిటీయా లేక గ్రామపంచాయతీనా..?
- ముంపు గ్రామాల విషయంలో సందిగ్ధం
- సిద్దిపేట రూరల్ మండలంలోని జీపీల పరిస్థితి అంతే
- పెండింగ్‌లోనే అక్కన్నపేట మండలం గుడాటిపల్లి
- సాంకేతిక సమస్యతో నిలిచిన ఎన్నికల ర్యాండమైజేషన్
- ఇప్పటికీ అధికారులకు అందని మార్గదర్శకాలు
- అయోమయంలో ఆయా గ్రామాల ప్రజలు



మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

గజ్వేల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణంతో ముంపునకు గురైన తొగుట, కొండపాక, అక్కన్నపేట మండలాల్లోని గ్రామపంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనమవుతాయా? లేదా పంచాయతీలుగా కొనసాగుతాయా? అన్న విషయంపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. అలాగే గౌరవెల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గుడాటిపల్లి గ్రామపంచాయతీ విషయంలోనూ సందిగ్ధం కొనసాగుతుంది. గుడాటిపల్లి ప్రస్తుతం హుస్నాబాద్ మున్సిపాలిటీలో పునరావాస కాలనీ ఏర్పాటైంది. కొంతకాలంగా పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అధికారులు ఓటరు జాబితాను విడుదల చేశారు. ఆ జాబితాల్లో ఆరు మల్లన్నసాగర్ ముంపు గ్రామాలతో పాటు సిద్దిపేటరూరల్ మండలంలోని 15 గ్రామ పంచాయతీలు, గౌరవెల్లి ముంపు గ్రామమైన అక్కన్నపేట మండలం గుడాటిపల్లితో కలిపి మొత్తం 22 గ్రామపంచాయతీల ఓటరు జాబితాను పెండింగ్‌లో ఉంచారు.

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గజ్వేల్, సంగాపూర్, ముట్రాజ్‌పల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి మూడేళ్ల క్రితం తరలించారు. ఈ గ్రామాల పౌర సేవల కార్యకలాపాలు మండల పరిషత్ కార్యాలయాల పరిధిలో ఉంటూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోనే కొనసాగుతున్నాయి. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణంతో తొగుట మండలం వేములఘాట్, బ్రాహ్మణ బంజేరుపల్లి, లక్ష్మాపూర్, పల్లెపహడ్, ఏటిగడ్డ కిష్టాపూర్, కొండపాక మండలంలోని ఎర్రవల్లి, తిప్పారం మధిర గ్రామమైన సింగారం గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అయితే, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కొనసాగుతుండగా పంచాయతీల పేరిట జాబితా విడుదల చేస్తే కొత్త సమస్య ఏర్పడే అవకాశం ఉందని అధికారులు భావించి ఓటరు జాబితా సవరణలో ఈ గ్రామాలను పక్కన బెట్టినట్లు తెలుస్తుంది. ఇక సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని 15గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను సిద్ధం చేసినా గెజిట్‌లో పేరు లేకపోవడంతో అప్‌లోడ్ చేసే విషయంలో టెక్నికల్ సమస్య ఏర్పడి అధికారులు పెండింగ్‌లో పెట్టారు. ఈ మండలంలో మొత్తం 14 గ్రామాలున్నాయి. కొత్తగా బచ్చాయపల్లి గ్రామ పంచాయతీ చేరడంతో వీటి సంఖ్య 15కు చేరింది. ఈ పంచాయతీ నారాయణరావుపేట మండలంలో ఆన్‌లైన్‌లో చూపిస్తున్నట్లు తెలిసింది. గౌరవెల్లిలో ముంపునకు గురైన గుడాటిపల్లి సైతం పెండింగ్‌లో ఉంచారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో గ్రామపంచాయతీ రెండు పంచాయతీల ఓటరు జాబితాపై స్పష్టత రాకపోవడంతో ఆశావహుల్లో ఆందోళన మొదలైంది.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కార్యాలయం

ఆందోళనలో ప్రజలు

మునిసిపాలిటీలో కొనసాగింపా... లేక గ్రామపంచాయతీలుగానే కొనసాగిస్తారా అన్న విషయమై స్పష్టత లేకపోవడంతో ముంపు గ్రామాలకు సంబంధించిన నిర్వాసితులు అయోమయానికి గురవుతున్నారు. గ్రామపంచాయతీలుగా కొనసాగిస్తేనే రాజకీయంగా అవకాశాలు ఉంటాయని భావిస్తున్న పలువురు గ్రామస్థులు ఆ దిశగానే ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరుతున్నా రు. ఇంకొందరు మాత్రం మునిసిపాలిటీలో విలీనం చేస్తేనే తమకు లాభం చేకూరుతుందని భావిస్తున్నారు. ఇక గుడాటిపల్లి, సిద్దిపేట రూరల్ మండలంలోని గ్రామపంచాయతీల నాయకులు త్వరలో పంచాయతీ ఎన్నికలు అన్న ప్రకటన వెలువడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు ఓటరు జాబితాతో పాటు ఎన్నికల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టని కారణంగా ఏమైనా ఇబ్బందులు తలెత్తితే

మిగతా 8వ పేజీలో...

ఈ రోడ్డు ఎవరి కోసం? నిధులు ఎక్కడివో?

- ప్రభుత్వ భూమి నుంచి సీసీ రోడ్డు ఏర్పాటుపై ఫిర్యాదులు
- ప్రైవేటు భూముల కోసమేనని ఆరోపణలు

జిన్నారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జిన్నారం శివారులోని 1002 ప్రభుత్వ భూమి నుంచి చేపట్టిన సీసీ రోడ్డు పనులపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమి నుంచి ఎవరి అనుమతితో.. ఎవరి కోసం రోడ్డు వేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. 90 అడుగుల మేర సీసీరోడ్డు నిర్మాణానికి సిద్ధమవగా స్థానికులు పనులను అడ్డుకున్నారు. జిన్నారం శివారులోని 1002 సర్వే నంబర్‌లో ప్రభుత్వ కళాశాల, జూనియర్ కళాశాల, వ్యవసాయ గిడ్డంగి, మినీ స్టేడియం కోసం కేటాయించిన స్థలాలు ఉన్నాయి. పాఠశాల, జూనియర్ కళాశాలల ముందు నుంచి ఉన్న మట్టి రోడ్డును 90 అడుగల వెడల్పుతో సీసీరోడ్డుగా మార్చేందుకు పనులు ప్రారంభించారు. ప్రభుత్వ స్థలం నుంచి ఎవరి కోసం.. ఏ శాఖ నిధులు వెచ్చించి రోడ్డు వేస్తున్నారని ప్రజలు నిలదీస్తున్నారు. జిన్నారం, పటాన్‌చెరు ప్రధాన రహదారి నుంచి చేపట్టిన పనులనలను స్థానికులు మూడు రోజుల క్రితం అడ్డుకున్నారు. తహసీల్దార్, ఎంపీ రఘునందన్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఊట్ల పంచాయతీ పరిధిలో ఉన్న పలు ప్రవేటు భూముల కోసమే ప్రభుత్వ స్థలం నుంచి సీసీరోడ్డు పనులు చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



జిన్నారం 1002 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిలో వేస్తున్న సీసీరోడ్డు

హుస్నాబాద్ బస్టాండ్‌కు హంగులు

- రూ. 2 కోట్లతో ఆధునికీకరణ
- తుదిదశకు చేరుకున్న పనులు
- 40 ఏళ్ల తర్వాత మారనున్న బస్టాండ్ రూపరేఖలు



8

ఎదురీత బతుకు..భరోసా కరువు

- దుర్భరం.. గజ ఈతగాళ్ల జీవనం
- నీళ్లలోని మృతదేహాలను వెలికితీయడమే పని
- సాహసాలు వారికి నిత్యకృత్యం



7

రైతులు, ప్లాట్ల యజమానులు నష్టపోకుండా చూడాలి

- నేషనల్ హైవే అథారిటీ రిజనల్ అధికారి కృష్ణప్రసాద్‌తో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



7



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న దివ్యాంగులు



దివ్యాంగుల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడలు

- జిల్లాస్థాయి పోటీలను ప్రారంభించిన కలెక్టర్ మనుచౌదరి
- విజేతలకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున బహుమతుల ప్రదానం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మనోధైర్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమశాఖ, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల జిల్లాస్థాయి క్రీడా కార్యక్రమాల్లో కలెక్టర్ మనుచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకార్యక్రమాలను ప్రారంభించారు. దివ్యాంగులతో కలిసి క్యారమ్, చెస్, షార్ట్ పుట్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. జిల్లాస్థాయితో పాటు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ దివ్యాంగులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో ఏటా క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీనియర్, జూనియర్ విభాగాల వారీగా విజేతలను ఎంపిక చేసి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిస్టిక్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ జయదేవ్, సెక్టోరియల్ ఆఫీసర్ రంగనాథ్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సౌందర్య, 7వ వార్డు కౌన్సిలర్ శ్రీదేవి బుచ్చిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సిద్దిపేట క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ అకాడమీలో కలెక్టర్ మనుచౌదరి వసతులను పరిశీలించారు. జిల్లాలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు వాలీబాల్ స్పోర్ట్స్ అకాడమి మంజూరు కాగా బాలబాలికలను వేర్వేరుగా హాస్టల్, భోజన వసతి కల్పించి ప్రత్యేక కోచ్ ద్వారా శిక్షణ ఇప్పించనున్నా రు. ఆయా భవనాలలో టాయిలెట్స్ మరమ్మతులు చేయించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి స్పోర్ట్స్ అధికారి జయదేవ్ ఆర్యాను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, ఫుట్‌బాల్ స్టేడియం, బాస్కెట్ బాల్ కోర్టు, స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించి సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేసి క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల పక్కన ఉన్న ప్రభుత్వ పీజీ కళాశాలను కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ రవినాథ్‌కు పలు సూచనలు చేశారు.



క్యారమ్ ఆడుతున్న దివ్యాంగులు

కాంగ్రెస్‌లో కొండపోచమ్మ చిచ్చు

- పునర్జీవన కమిటీలో ఓ వర్గానికే అవకాశం
- పోలీసు బందోబస్తు మధ్య దర్శనం
- మరికొందరికి చోటిస్తారా..?



కొండపోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పునర్జీవన కమిటీ సభ్యులు

జగదేవ్‌పూర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్ సమీపంలోని ప్రసిద్ధ కొండపోచమ్మ ఆలయ పునర్జీవన కమిటీ నియామకం స్థానికంగా చర్చనీయాంశమైంది. కమిటీని ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి జీవోను విడుదల చేసింది. అయితే, స్థానికంగా కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలున్నప్పటికీ కమిటీ నియామకంలో ఓ వర్గానికే ప్రాధాన్యం ఇవ్వడం అంతర్గతంగా చిచ్చు పెట్టినట్లయింది. శుక్రవారం కమిటీ సభ్యులు కొండపోచమ్మ ఆలయ దర్శనానికి రావడంతో అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

వీరే సభ్యులు

జగదేవ్‌పూర్ మండలం మాందాపూర్ గ్రామానికి చెందిన లింగాని వజ్రమ్మ, బీజీ వెంకటాపూర్‌కు చెందిన చెక్కల నరేశ్, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆటమల్లు, తీగుల్-రాంనగర్‌కు చెందిన కోట ఆశయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నలుగురు సభ్యులతో ఆలయ కమిటీ నియమించడంతో గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

బందోబస్తు మధ్య దర్శనం

కొండపోచమ్మ పునర్జీవన కమిటీ సభ్యులు భారీ పోలీసు బందోబస్తు మధ్య అమ్మవారిని దర్శించుకోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గజ్వేల్‌రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు చంద్రమోహన్, దామోదర్, కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ మరోవర్గమైన నర్సా రెడ్డి, బండారు శ్రీకాంత్‌రావు వర్గానికి మధ్య ఘర్షణ తలెత్తే అవకాశం ఉందన్న ముందస్తు సమాచారంతోనే బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిసింది. బండారు శ్రీకాంత్‌రావు వర్గానికి చెందిన నలుగురికి కమిటీలో చోటు దక్కడంతో నర్సారెడ్డి వర్గీయులు గొడవ చేసే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు సమాచారం అందించడంతోనే బందోబస్తును ఏర్పాటు చేసిన ట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులకు, బండారు శ్రీకాంత్‌రావుకు అర్చకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

కమిటీలో మరికొందరికి చోటు?

కొండపోచమ్మ ఆలయ పునర్జీవన కమిటీలో మరికొందరికి చోటు కల్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటివరకు పూర్తిస్థాయి కమిటీ ఏర్పడక దాదాపుగా ఐదేళ్లు కావొస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పూర్తిస్థాయి కమిటీ ఏర్పడుతుందని భావించినా మరోసారి పునరుజ్జీవ కమిటీనే ఏర్పాటు చేయడంతో పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటుపై ఆశలు సన్నగిల్లాయి. కాగా పునరుజ్జీవ కమిటీలో మరికొందరికి చోటు కల్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.



కొండపోచమ్మ ఆలయం వద్ద పోలీసు బందోబస్తు

కాంగ్రెస్‌లో కష్టపడే వారికే గుర్తింపు : శ్రీకాంత్‌రావు

కాంగ్రెస్‌లో కష్టపడే వారికే గుర్తింపు లభిస్తుందనడానికి కొండపోచమ్మ ఆలయ కమిటీ సభ్యులే నిదర్శనమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు పునరుజ్జీవ కమిటీలో చోటు కల్పించామని, వారిలో ఆటోడ్రైవర్, మేస్త్రీ, వ్యవసాయ కూలీలకు ప్రాతినిధ్యం ఇచ్చామన్నారు. వారికి అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేశ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట నాయకులు నాయిని యాదగిరి, గోపాల్‌రావు, భానుప్రకాశ్‌రావు, ఉప్పల ప్రవీణ్‌కుమార్, దాసు, స్వామి, రతన్, అనిల్, జానీ, రవి తదితరులున్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

సంగారెడ్డి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఓటరు నమోదు కోసం ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. 18 సంవత్సరాలు నిండినవారందరూ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు నమోదు చేసుకోనివారికి మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి ఎన్నికల సిబ్బంది ఓటర్ నమోదు దరఖాస్తులను స్వీకరిస్తారని వెల్లడించారు. నూతన ఓటరు నమోదు ఫారం 6తో పాటు తప్పుల సవరణ, చిరునామా మార్పు, చనిపోయిన వారిపేర్లు జాబితా నుంచి తొలగింపులకు కూడా ప్రత్యేక ఓటరు కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. ఈ అకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



తాగునీటి కష్టాలు

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని బాబానగర్‌లో నెలరోజులుగా మిషన్ భగీరథ నీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని బోరు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో పొలాల బోర్ల వద్ద నీటిని తెచ్చుకుంటున్నారు. -జహీరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)

చెట్లు నరికి.. దుకాణాలు

- యథేచ్ఛగా అటవీ భూమి ఆక్రమణ
- నిబంధనలకు విరుద్ధంగా కల్లు, మద్యం అమ్మకాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు



పలుగుమీది పోచమ్మ ఆలయానికి ఎదురుగా అటవీ ప్రాంతంలో వెలసిన దుకాణాలు



అటవీ ప్రాంతంలో చెట్లను నరికి ఏర్పాటు చేసిన దుకాణం

హత్నూర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నా, అవి నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. విలువైన భూములు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. చెట్లు నరికినా పరవాలేదు.. చేతులు తడితే చాలు అన్న చందంగా మారింది అటవీశాఖ అధికారుల తీరు. ఒక్కో దుకాణానికి ఒక్కో రేటు చొప్పున డబ్బులు ముట్ట చెబుతున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. హత్నూర మండలం శేర్కాన్‌ఖాన్‌పల్లి గ్రామ శివారులో ప్రసిద్ధిగాంచిన పలుగుమీది పోచమ్మ తల్లి ఆలయం అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉంది. అక్కడ నిత్యం పరిసర గ్రామాలతో పాటు హైదరాబాద్, సంగారెడ్డి, నర్సాపూర్ వంటి ప్రాంతాల నుంచి భక్తులు వందల సంఖ్యలో వచ్చి పోతుంటారు. ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతంలో విందులు వినోదాలు చేసుకుంటుండడంతో ఇదే అదునుగా భావించిన స్థానికులు కొందరు అమ్మవారి ఆలయం పరిసరాలలో సర్వే నెంబరు 99లోని అటవీ భూముల్లో చెట్లను నరుకుతూ కబ్జా చేస్తూ, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ రేకుల షెడ్లలో కల్లు, మద్యం దుకాణాలు నిర్వహిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా మాంసం ఇతరత్రా వంటకాలు చేసి బార్లను తలదన్నేలా తినుబండరాలు విక్రయిస్తున్నారు. ఇలా శేర్కాన్‌పల్లి, నత్నయపల్లి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణ కొనసాగుతుంది.

అధికారుల కనుసైగల్లోనే...

గత కొంతకాలంగా ఆక్రమణలు కొనసాగుతున్నా.. అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో దుకాణానికి ఒక్కో రేట్ చొప్పున కొందరు అధికారులకు డబ్బులు చెల్లిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అటవీ శాఖ అధికారుల కనుసైగాల్లోనే ఈ తంతు కొనసాగుతుందని పరిసర గ్రామాల ప్రజలు కొందరు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అటవీ భూమి ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నోటీసులు జారీ చేశాం..

రిజర్వుడ్ ఫారెస్టులో భూమి ఆక్రమించి దుకాణాలు నెలకొల్పిన విషయం వాస్తవమేనని వావిలాల సెక్షన్ ఆఫీసర్ షాహినీ తెలిపారు. అక్కడ రిజర్వుడ్ ఫారెస్టులో ఉన్న భూములు, దుకాణదారులు అందరికీ ఇటీవల నోటీసులు జారీ చేశామని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ భూములను ఆక్రమించిన దుకాణాదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రస్థాయికి 25 మంది క్రీడాకారులు



మెదక్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 10వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జిల్లాస్థాయి పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభుకుమార్‌గౌడ్ ప్రారంభించారు. అండర్-8, 10, 12 బాల బాలికలకు రన్స్, త్రో, జంప్స్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 25 మంది వచ్చే నెల డిసెంబరు 1న మంచిర్యాల జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు.

ఎదురీత బతుకు.. భరోసా కరువు

దుర్భరం.. గజ ఈతగాళ్ల జీవనం

ప్రకృతి విపత్తు సంభవించి వరదలు వచ్చినా.. ప్రమాదవశాత్తు ఎవరైనా నీటిలో పడిపోయినా... సహాయక చర్యలు చేపట్టాలంటే ముందుగా గుర్తొచ్చేది గజ ఈతగాళ్లే. ఎంత లోతైనా, నీటి ప్రవహం ఎంతున్నా వారు గంగకు ఎదురెళ్లి సాయం అందించాలి. ప్రాణాలు పణంగా పెట్టి సాహోసోపేతంగా సాయమందిస్తారు. వారి సమస్యలు తెలుసుకుంటే ఎవరికైనా గుండె చెరువవ్వాల్సిందే. వేగంగా వస్తున్న నీటికి ఎదురు ఈద గలుగుతున్నారు కానీ జీవితమనే నావను నడపకలేకపోతున్నారు. లోతైన బావిలో దరిని తాకి వస్తున్నారు కానీ వారికి గుర్తింపు కోసం సరైన దారి దొరకటం లేదు.

- నీళ్లలోని మృతదేహాలను వెలికితీయడమే పని
- సాహసాలు వారికి నిత్యకృత్యం..
- ప్రాణం పణంగా పెట్టినా దక్కని గుర్తింపు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


సిద్దిపేట కోమటి చెరువు వద్ద గజ ఈతగాళ్లు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రం కోమటి చెరువు పరిసర ప్రాంతాల్లోని ఎన్టీఆర్‌నగర్‌లో గత కొన్నేళ్లుగా కొన్ని కుటుంబాలు ఈతను ప్రవృత్తిగా ఎంచుకుని పనిచేస్తున్నాయి. వంశపారంపర్యంగా నేర్చుకున్న ఈతతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తొడెంగుల యాదగిరి, తొడెంగుల కృష్ణ (కిట్టు), తొడెంగుల రాజేందర్, నాగరాజు, మహేష్, శ్రీరంగం, చంద్రం, ఎయ్య రాజు, చామంతుల కనకయ్య, వాజీద్ వీరంతా గజ ఈతగాళ్ల బ్యాచ్‌గా ఏర్పడ్డారు. ఎక్కడ ఎవరు నీళ్లలో పడిపోయినా, నీటిలో దూకి ఆత్మహత్య చేసుకున్నా వీరు టీమ్‌లుగా వెళ్లి మృతదేహాలను వెతికి పైకి తెస్తుంటారు. సిద్దిపేట జిల్లానే కాకుండా చాలాసార్లు ఇతర జిల్లాలకు కూడా వెళ్లి రెస్క్యూ ఆపరేషన్లు చేసి వస్తుంటారు. పండుగలు, ఫంక్షన్లు ఉన్నా కూడా పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ వచ్చిందా వాళ్ల పనిముట్లు తీసుకుని రెస్క్యూకు వెళ్లాల్సిందే. అర్ధరాత్రి, అపరాత్రి అని తేడా ప్రాణాలు పణంగా పెట్టి చెరువు, బావుల్లో దూకాలి. ఎముకలు కొరికే చలిలో సైతం నీళ్లలోకి దిగాలి. ఇంత చేస్తున్నా కూడా సత్కారాల కంటే చీత్కారాలే ఎక్కువ ఉన్నాయని గజ ఈతగాళ్లు తమ అనుభవాలను పంచుకున్నారు.

ఎన్నో కష్టాలకోర్చి..

నీళ్లలో పడిపోయిన శవాలను తీయటం కొన్నిసార్లు పెద్ద సమస్యగా మారుతుందని, గంటల తరబడి, రోజుల తరబడి వెతికాల్సి వస్తుందని తెలిపారు. నీటిలో మృతదేహాలను కనిపెట్టడం ఒక ఎత్తైతే.. వాటిని పైకి తేవటం మరో ఎత్తని, కొనిసార్లు శవాల శరీర భాగాలు ఊడిపోయి తమ చేతుల్లోకి వస్తుంటాయని చెప్పారు. ముళ్లపొదల్లో చిక్కుకున్న శవాలు తీయటానికి నానాతంటాలు పడాల్సి వస్తుందని, పురుగులు పట్టిన బాడీని పట్టుకున్నప్పుడు దుర్వాసనతో పాటు పురుగులు మాపైకి ఎక్కుతుంటాయని చెప్పారు. ఇప్పటివరకు దాదాపు 15 అనాథ శవాలకు అంత్యక్రియలు కూడా చేసినట్లు తెలిపారు. మృతదేహాల వెలికితీతతో కొన్నిసార్లు న్యాయపరమైన ఇబ్బందులు కూడా ఎదురవుతుంటాయన్నారు. గతంలో ఎన్సాన్‌పల్లికి చెందిన ఒకరు చెరువులో పడిపోయాడని వారి బంధువులు ఇబ్బంది పెడితే దూకి తీశామని, తీరా మృతదేహంపై తమ వేలిముద్రలున్నాయని సుమారు 10 సంవత్సరాలు కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చిందని ఉదాహరించారు. ఇలా చెబుతూపోతే చాలా ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం తరుపున ఎలాంటి సహాయం అందడంలేదని వాపోతున్నారు. నీళ్లలో దూకేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కోరుతున్నారు. మెడికల్ కిట్, ఆక్సిజన్ అందుబాటులో పెడితే బాగుంటుదంటున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రభుత్వం తమను గుర్తించి గుర్తింపు కార్డులు అందజేయాలని కోరుతున్నారు. ఎంతోకొంత కుటుంబం గడవడానికి జీవనోపాధి చూపిస్తూ, పనిచేసేటప్పుడు మాకు ఏదైనా జరగరానిది జరిగితే కుటుంబానికి ఆర్థికంగా భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు.

సెల్‌ఫోన్‌లు, డ్రోన్‌లు, విగ్రహాలూ..

పర్యాటకుల సెల్‌ఫోన్‌లు, డ్రోన్ కెమెరాలు నీళ్లలో పడిపోయినా వారి సమచారం మేరకు వెతికి ఇస్తుంటామని చెబుతున్నారు. వినాయక విగ్రహాలు, అమ్మవారి ప్రతిమలు నిమజ్జనం తర్వాత వాటిని నీళ్లలో నుంచి బయటకు తెస్తామని, ఆ సమయంలో కూడా చాలా ప్రమాదాలు జరుగుతాయంటున్నారు. డైవ్ చేసినప్పుడు విగ్రహాల్లో తల ఇరుక్కొని ఇద్దరు చనిపోయారని గుర్తుచేసుకుని బాధను వ్యక్తం చేశారు.


మృతదేహాన్ని బయటకు తెస్తున్న గజ ఈతగాళ్లు (ఫైల్)

వంశపారంపర్యంగా చేస్తున్నాం: తొడెంగల యాదగిరి

వంశపారంపర్యంగా ఇదే పని చేస్తున్నాం. నేను 40 ఏళ్ల నుంచి ఇదే పనిలో ఉన్నాను. నా కొడుకు కూడా ఈ పనికే వస్తున్నాడు. ప్రభుత్వం నుంచి ప్రతినెలా కొంత ఆర్థిక సాయం అందిస్తే మాకు చేదోడువాదోడుగా ఉంటుంది. గతంలో వచ్చేవి కానీ ఇప్పుడు రావటం లేదు.

సేఫ్టీ కిట్‌లు అందించాలి : తొడెంగల కృష్ణ

కొన్నిసార్లు ప్రమాదవశాత్తు మావాళ్లు కూడా చనిపోతున్నారు. ఎమర్జెన్సీ సమయంలో వాడేందుకు ఆక్సిజన్, మెడికల్ కిట్ అందుబాటులో పెట్టాలి. దూర ప్రాంతాలకు వెళ్లాడానికి వీలుగా ఒక వాహనం ఏర్పాటు చేయాలి. టోల్ టాక్స్ నుంచి మాకు మినాహాయింపు ఇవ్వాలి.

మాకు ప్రభుత్వం నుంచి గుర్తింపు కావాలి : తొడెంగల రాజేందర్

ప్రాణాలు పణంగా పెట్టి నీళ్లలోకి దూకుతాం. మా పనికి ప్రభుత్వం నుంచి గుర్తింపు కావాలి. ఈ విషయమై పలువురికి వినతిపత్రాలిచ్చినా ప్రయోజనం లేదు. ప్రస్తుత ఏసీపీ మధు సార్, మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్‌కుమార్ సార్ మాకు సత్కరించడం ఆనందంగా అనిపించింది.


దత్తగిరి ఆశ్రమంలో పూజలు చేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

రైతులు, ప్లాట్ల యజమానులు నష్టపోకుండా చూడాలి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైవే పనుల్లో భాగంగా రైతులు నష్టపోకుండా చూడాలని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందరావు నేషనల్ హైవే అథారిటీ రిజినల్ అధికారి కృష్ణప్రసాద్‌కు సూచించారు. గురువారం సాయంత్రం హైదరాబాదులోని ఎన్‌ఎచ్‌ఏఐ కార్యాలయంలో ఆయనతో ఎంపీ సమావేశమయ్యారు. ఎల్కతుర్తి నుంచి రామాయంపేట వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవేతో నష్టపోతున్న రైతులతో వెళ్లి కలిశారు. బ్లాక్ ఆఫీస్ నుంచి రంగధాంపల్లి వరకు నిర్మిస్తున్న అండర్ పాస్, ఎన్సాన్‌పల్లి చౌరస్తా (సర్దార్ పాపన్న గౌడ్) వద్ద నిర్మిస్తున్న గోడతో కూడిన ఫ్లైఓవర్ వల్ల రైతులు, ప్లాట్ల యజమానులకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలను చూపి రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన అధికారులు నష్టం వాటిల్లకుండా రీ డిజైన్ చేసి పంపిస్తామని హామీ ఇచ్చారు.

దత్తగిరి ఆశ్రమంలో ఎంపీ పూజలు..

ఝరాసంగం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆశ్రమ భావిపీఠాధిపతి డా.సిద్దయ్యస్వామి శాలువ, పూలమాలలతో ఎంపీని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడదీయడం సరికాదు

● జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్


ధర్మారం గ్రామానికి చేరుకున్న మాలల మహాపాదయాత్ర

దుబ్బాక/ మిరుదొడ్డి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వర్గీకరణపేరుతో ఎస్సీలైన మాలమాదిగలను విడదీయడం సరికాదని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. గత నెల 25న భద్రాచలంలో చేపట్టిన మాలల మహాపాదయాత్ర శుక్రవారం మిరుదొడ్డి మండలం ధర్మారం, దుబ్బాక మండలం హబ్షీపూర్, దుబ్బాక పట్టణానికి చేరుకుంది. స్థానికంగా ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీలను విడదీసి రాజకీయంగా అణగదొక్కలానే కుట్రలో భాగంగా ఎస్సీ వర్గీకరణను చేపట్టిందన్నారు. ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా, దళితుల ఐక్యతకోసం మాలల మహాపాదయాత్రను చేపట్టినట్లు గుర్తుచేశారు. డిసెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల మహాసంగ్రామసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నరాజు, సత్యానారాయణ, అంజయ్య, ర్యాకం శ్రీరాములు, భీమసేన, పురుశోత్తం, రాజేశం, దేవయ్య, యాదగిరి, కాల్వలింగం, రాజయ్య, సాయిలు, శేఖర్, రాజు, స్వామి తదితరులున్నారు.

భార్యతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని.. అంతమొందించాడు

● వ్యక్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు
● నిందితుడి రిమాండ్


తూప్రాన్‌లో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రంగా కృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్

మనోహరాబాద్, నవంబరు 22: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులో గత శనివారం రాత్రి ప్రమోద్ కూమార్ పాశ్వాన్ అనే వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను తూప్రాన్ సీఐ రంగా కృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్ శుక్రవారం వెల్లడించారు. హైదారాబాద్‌కు చెందిన పాండరీ శ్రీరామ్ కాళ్లకల్ గ్రామ శివారులో నూతనంగా ఇల్లును నిర్మిస్తున్నారు. ఇంటి పనులను పంజాబ్ రాష్ట్రానికి చెందిన ప్రమోద్ కూమార్ పాశ్వాన్ మేస్త్రీకి గుత్తకు ఇచ్చాడు. దీంతో ప్రమోద్ కూమార్ పాశ్వాన్ వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన బిట్టు తోపాటు అతడి భార్యాపిల్లలు ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమోద్ పాశ్వాన్ బిట్టు భార్య పూజను పలుమార్లు తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. గత శనివారం కూడా పూజతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో బిట్టు ప్రమోద్ పాశ్వాన్‌కు హెచ్చరించాడు. అయినా వినకపోవడంతో బిట్టు కోపంతో పక్కనే ఉన్న కర్రతో పలుమార్లు తలపై మోదాడు. దీంతో ప్రమోద్ పాశ్వాన్ అక్కడికక్కడే మృతి చెందగా... బిట్టు భార్య పిల్లను తీసుకుని అక్కడి నుంచి బీహార్‌కు పారిపోయారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు శుక్రవారం బిట్టును పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. హత్య జరిగిన ఏడు రోజుల వ్యవధిలోనే కేసును ఛేదించిన ఎస్ఐ సుభాష్‌గౌడ్, ఐడీ పార్టీ సిబ్బంది గోవర్ధన్, శ్రీనివాస్ రాథోడ్, కృష్ణ కానిస్టేబుళ్లను సీఐ రంగా కృష్ణ అభినందించారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొట్టిన లారీ

యువకుడి దుర్మరణం

● మరో ఇద్దరి పరిస్థితి విషమం..


వంశీ(ఫైల్)

మెదక్ అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయలైన ఘటన పట్టణంలోని పిల్లికొట్యాల్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండల పరిధిలోని శాలిపేట గ్రామానికి చెందిన దాసరం వంశీ(22), తమ్ముడు దాసరం నవీన్, సోదరి భాగ్యతో కలిసి పల్సర్ బైక్‌పై శుక్రవారం మధ్యాహ్నం సంగాయిపల్లి నుంచి పని నిమిత్తం మెదక్‌కు వస్తున్నారు. పిల్లి క్యాటాల్ సమీపంలో మెదక్ నుంచి చేగుంట వైపు ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా వచ్చి వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వంశీ అక్కడికక్కడే మృతి చెందగా.. నవీన్, భాగ్యకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడినవారిని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది. వంశీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి మామ రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు.

నీట మునిగి వ్యక్తి..


సాయిలు(ఫైల్)

పాపన్నపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయ సమీపంలోని మంజీరా చెక్ డ్యాంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన చాకలి సాయిలు(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఓ విందు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఏడుపాయలకు వచ్చాడు. దర్శనం అనంతరం సాయంత్రం సమయంలో అందరూ కలిసి ఆలయ సమీపంలోని ఉన్న చెక్ డ్యాం వద్దకు వెళ్లగా. సాయిలు స్నానం చేసేందుకు అందులోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి ఊపిరాడక మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రాణి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


వెంకటేష్(ఫైల్)

శివ్వంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొంతాన్ పల్లి గ్రామానికి చెందిన కుల్ల వెంకటేష్(24) దినసరి కూలీ. కొన్ని రోజులుగా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో పాటు తన తల్లి కోసం ఏమి చేయలేకపోతున్నానని మనోవేదనతో బుధవారం రాత్రి తమ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూసైడ్ నోట్‌లో 'పొలం జాగ్రత్త.. చెల్లి పెళ్లి చేయాలి' అని అమ్మకు సూచినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

వివాహిత అదృశ్యం


రేణుక(ఫైల్)

రామచంద్రాపురం, నవంబరు 22 : వివాహిత అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొమురంభీంకాలనీలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం కాలనీకి చెందిన వైశ్రీరాములు తన కూతురు రేణుక(20)కు టేక్మాల్‌కు చెందిన పంతులు గణేష్‌తో 6 నెలల క్రితం వివాహం చేశారు. వారం క్రితం రేణుక తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. శుక్రవారం ఉదయం బయటకని వెళ్లిన రేణుక ఎంతకీ తిరిగి రాలేదు. బంధుమిత్రులు వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాసేవకు అంకితం కావాలి

● మెదక్ జిల్లాకు 149 మంది కొత్త కానిస్టేబుళ్ల కేటాయింపు
● రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తూ విధులు నిర్వర్తించాలి
● మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి


కానిస్టేబుల్‌కు ఆర్డర్ కాపీని అందజేస్తున్న మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): సమాజం పట్ల విశ్వసనీయత పెంపొందించేలా ప్రజాసేవకు అంకితం కావాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాకు కొత్తగా కేటాయించిన 149 మంది కానిస్టేబుళ్లకు ఎస్పీ ఆర్డర్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజానికి అత్యున్నతమైన సేవలు అందించే అవకాశం ఉన్న పోలీస్‌శాఖలో చేరి శిక్షణ పూర్తి చేసుకుని నేటి నుంచి పూర్తి బాధ్యతల్లో చేరారన్నారు. శిక్షణ సమయంలో అవవర్చుకున్న క్రమశిక్షణ రాబోయే రోజుల్లో కూడా అనుసరించాలన్నారు. ప్రజల రక్షణే బాధ్యతగా పని చేయాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించకుండా రాజ్యాంగ ధర్మాని పాటిస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం సమవర్థంతంగా విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లాకు కేటాయించిన 149 కొత్త కానిస్టేబుళ్లల్లో సివిల్ 52, సివిల్ మహిళా 26, సాయుధ దళ 56, మహిళా సాయుధ దళ 15 మంది ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

● సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకొని జిల్లాలో రిపోర్ట్ చేసిన కానిస్టేబుళ్లకు కంది మండలం చిద్రూప్పలోని పోలీసు శిక్షణ కేంద్రంలో గురువారం రాత్రి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధులల్లో చేరుతున్న కానిస్టేబుళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. అంకిత భావంతో పని చేస్తూ పోలీసుస్టేషన్‌కు వచ్చేవారితో, అధికారులు, సహచర కానిస్టేబుళ్లతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో పూర్తి నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఫిజికల్‌గా, మానసికంగా ఫిట్‌గా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోగలమన్నారు. నూతన చట్టాల గురించి నిరంతరం తెలుసుకుంటూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో జాగ్రత్తగా ఉండాలని, ఏది అవసరం, ఏది అనవసరం అనేది గుర్తెరిగి నడుచుకోవాలని సూచించారు. సిబ్బంది అందరు తమకు కేటాయించిన హెడ్ క్వార్టర్ నందు అందుబాటులో ఉండాలని, అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. అధికారుల ఆదేశాలను పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, ఆఫీసు సూపరింటెండెంట్లు అశోక్, వెంకటేశం, మినిస్టీరియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అరెస్ట్

● చనిపోయిన సోదరుడి పేరిట ఉన్న భూమి కాజేసే యత్నం
● గెజిటెడ్ అధికారి సంతకం ఫోర్జరీ.. పోలీసులకు ఫిర్యాదు



నిందితుడిని విలేకరులకు చూపుతున్న పోలీసులు

జోగిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన సోదరుడి పేరిట ఉన్న 2.11 ఎకరాల వ్యవసాయ భూమిని కాజేసేందుకు గెజిటెడ్ అధికారి సంతకం ఫోర్జరీ చేసిన కేసులో జోగిపేట వ్యసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జోగిపేట ఎస్ఐ పాండు శుక్రవారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డీబీ నాగభూషణం (54) సొంత అన్న బుడాల రాములు గతేడాది మృతి చెందారు. ఆయనకు సర్వే నెంబరు 217లో 2.11 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, దానిని కాజేసేందుకు నాగభూషణం పన్నాగం పన్నాడు. అన్న మృతి చెందిన విషయాన్ని దాచి ఉంచి అతని పేరిట ఉన్న పాస్ బుక్ కరెక్షన్ కోసమంటూ గత ఏప్రిల్ 1న అందోలు తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ దరఖాస్తులో భూషణం తన సొంత మొబైల్ నెంబర్‌ను పేర్కొన్నాడు. దరఖాస్తు పరిశీలనలో భాగంగా, తహసీల్దారు సదరు నెంబరుకు ఫోన్ చేసి సదరు భూమికి సంబంధించిన రైతువారీ పట్టా ధ్రువపత్రం సమర్పించమని కోరారు. అన్న పేరిట తప్పుడు రైతువారీ ధ్రువపత్రాన్ని తయారు చేయడమేగాకుండా, అన్న మరణ ధృవపత్రపు జిరాక్స్ కాపీపై శ్రీకాంత్ అనే గెజిటెడ్ అధికారి సంతకం తీసుకుని, ఆయన స్టాంప్‌ను కూడా వేయించుకున్నాడు. మరణ ధ్రువీకరణపత్రంపై ఉన్న గెజిటెడ్ అధికారి సంతకం, స్టాంప్‌ను ఫోన్లో క్రాప్ చేసి, దానిని కలర్ ప్రింట్ తీసి, తాను తయమారు చేయించిన దొంగ రైతువారీ పట్టాపై కలర్‌ప్రింట్ తీసి.. అదే నిజమైన రైతువారీ పట్టాగా, తహశీల్దారు కార్యాలయంలో సమర్పించాడు. ఈవిషయమై జరిపిన విచారణలో ధ్రువపత్రం ఫోర్జరీదని తేలింది. దీంతో డిప్యూటీ తహసీల్దారు సాగర్ మధుకర్ రెడ్డి పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం నాగభూషణంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కూతురితో తండ్రి అసభ్య ప్రవర్తన

● కేసు నమోదు

టేక్మాల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రే సొంత కూమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తిండంతో పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. టేక్మాల్ ఎస్ఐ రాజేశ్ కథనం ప్రకారం.. టేక్మాల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తన కుమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె భయపడిపోయింది. దీంతో తల్లితో కలిసి అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లింది. కొద్దిరోజుల తర్వాత తండ్రి వెళ్లి మాయమాటలు చెప్పి.. మంచిగా ఉంటానంటూ బతిమిలాడి భార్య, కుమార్తెను ఇంటికి తెచ్చుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత మళ్లీ అలాగే ప్రవర్తించడంతో తల్లితో కలిసి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో మూడేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన కేసులో దోషికి 3సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి కె.జయంతి శుక్రవారం నాడు తీర్పు చెప్పారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన మహేంద్ర జగదీష్ అలియాస్ మ్యాతరి జగన్ (20) అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను 2019లో కిడ్నాప్ చేశాడు. ఈ మేరకు పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో ఆధారాలు సమర్పించగా నేరం రుజువైంది. దోషికి 3సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు.

చదువుతో పాటు కంప్యూటరూ నేర్చుకోవాలి: గడ్డమీద రేఖస్వామి

దౌల్తాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు కంప్యూటర్‌ను నేర్చుకోవాలని పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ గడ్డమీది రేఖ స్వామి అన్నారు. ఇందుప్రియల్ గ్రామ జడ్పీ పాఠశాలలో శుక్రవారం కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ అఫ్జల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

కొమ్మూరి పరామర్శ

చేర్యాల, నవంబరు 22: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ నాయకుడు అందె బీరయ్యను జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయనవెంట పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పీఏసీఎస్ చైర్మన్ మేరుగుకృష్ణ, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, ముస్త్యాల తార, నాయకులు ఉన్నారు.

హుస్నాబాద్ బస్టాండ్‌కు కొత్త హంగులు

- రూ. 2 కోట్లతో ఆధునికీకరణ
- తుదిదశకు చేరుకున్న పనులు

హుస్నాబాద్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 22: ఆధునికీకరణ పనులతో హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు మారుతున్నాయి. ఇప్పటికే పనులు పూర్తి కావాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్తనడకన సాగాయన్న ఆరోపణలున్నాయి. పనులకు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ సంవత్సరం మార్చి 8న ఆయన ఈ పనులకు శంకుస్థాపన చేశారు. అదే నెల 21న పనులు ప్రారంభమయ్యాయి.

40 ఏళ్ల తర్వాత..

హుస్నాబాద్ బస్టాండ్‌ను 1984 జూన్ 17వ తేదీన అప్పటి ఎమ్మెల్యే దివంగత బొప్పరాజు లక్ష్మీకాంతారావు కృషితో నాటి రవాణా శాఖ మంత్రి సంగంరెడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. అప్పుడు మూడు వరకు ప్లాట్ ఫామ్‌లుండేవి. తదనంతరం పలుమార్లు రిపేర్లు వంటివి చేశారు. మళ్లీ 2017 ఆగస్టు 14న రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. దీనికి రూ. 33.59 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం బస్టాండ్‌లో 8 ప్లాట్‌ఫామ్‌లుండగా అదనంగా మరో మూడు ప్లాట్‌ఫామ్‌లు నిర్మించారు. 40 ఏళ్ల తర్వాత బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు నిధులు మంజూరు చేశారు.




బస్టాండ్ ప్రవేశ ద్వారం, వెలుపల శరవేగంగా జరుగుతున్న పనులు

తుది దశకు పనులు

బస్టాండ్ పనులు తుదిదశకు చేరుకుంటున్నాయి. తూర్పు వైపు ఒక ప్లాట్ ఫామ్, పడమర వైపు రెండు ప్లాట్‌ఫామ్‌లు నిర్మిస్తున్నారు. అదనంగా నిర్మిస్తున్న రెండు ప్లాట్‌ఫామ్‌ల (పడమర) వైపు మరుగుదొడ్లను నిర్మించారు. బస్టాండ్ ఎదుట ఎలివేషన్, రేయిలింగ్ వంటి పనులు చేస్తున్నారు. బస్టాండ్ ప్రాంగణ ప్రహరీ పక్కన మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతు



పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది

చిన్నకోడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ సమీపంలో మిషన్ భగీరథ పైపలైను గేటు వాల్వ్ పక్క నుంచి నీరు లీకేజీ అయి వృథాగా పోతున్న విషయమై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఫొటో కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. సిబ్బందితో పైప లైను లీకేజీకి మరమ్మతు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని కలిగిఉండాలి

- శ్రీరాంపూర్ పీఠాధిపతి మాధవనందసరస్వతీస్వామి

మిరుదొడ్డి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని కలిగి ఉండాలని తొగుట రాంపూర్ పీఠాధిపతి మాధవనంద సరస్వతీ స్వామి అన్నారు. మండలంలోని ఆరెపల్లి, లక్ష్మీనగర్ సదాసంధాశ్రమ 41వ వార్షికోత్సవంలో శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మ ఆచరణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, చెట్టు, పుట్టలో దేవుడిని చూస్తున్న మనం తల్లీదండ్రులకు, గురువులను గౌరవించినప్పుడే పుణ్యఫలం లభిస్తుందన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

- ముగిసిన కొండపోచమ్మ వార్షికోత్సవాలు



జగదేవ్‌పూర్: శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

జగదేవ్‌పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపోచమ్మ అమ్మవారి 23వ వర్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆలయం వద్ద శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కొండపోచమ్మ మాజీ చైర్మన్లు హన్మంతరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రజిత రమేష్, యాదవరెడ్డి, మచ్చేందర్‌రెడ్డిలు దర్శించుకున్నారు.

- చేర్యాల: చేర్యాల పట్టణంలోని పెద్దచెరువు ఆవరణలో ఇటీవల నిర్మించిన మడేలయ్య ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన వేడుకలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో రజక కులస్థులు భారీగా పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చూడాలి

- కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న హరికృష్ణ

సిద్దిపేట రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవానికి అందేలా కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పిలుపునిచ్చారు. సిద్దిపేట రూరల్ మండలం ఇరుక్కోడులోని ఓ గార్డెన్‌లో శుక్రవారం రూరల్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరైయ్యారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. సిద్దిపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 11 నెలల్లోనే 55వేల ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నా లక్ష రూపాయల రుణమాఫీ కూడా చేయలేని బీఆర్‌ఎస్‌కు ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చి రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, జిల్లా నాయకులు పూజల గోపి కృష్ణ, మంద పాండు, సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షుడు దరిపల్లి రాములు తదితరులున్నారు.

'నామినేటెడ్ పదవులు జనరల్ స్థానాల్లో రెడ్డిలకే ఇవ్వాలి'

సిద్దిపేట రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో భర్తీ చేస్తున్న నామినేటెడ్ పదవుల్లో జనరల్ స్థానాల్లో రెడ్డిలకే ఇవ్వాలని రాష్ట్ర రెడ్డి సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు దొంగల బాపురెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడులోని ఓ గార్డెన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. జనరల్ స్థానాల్లో ఇతర రిజర్వేషన్లు ఉన్నవారికి ఇవ్వడం వల్ల రెడ్డిలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి జనరల్ స్థానాల్లో రెడ్డిలకు అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో రెడ్డి ఐక్య వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు కోడారి మల్లారెడ్డి, జిల్లా రెడ్డి యూత్ అధ్యక్షుడు కోండి రాజిరెడ్డి ఉన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించాలి: కిరణ్‌కుమార్‌గౌడ్



టీపీసీసీ చీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిరణ్‌కుమార్‌గౌడ్

చేర్యాల, నవంబరు 22(ఆంధ్ర జ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ పట్టణానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్‌గౌడ్ హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వ కార్యాలయాల సేవలు పొందడంలో చేర్యాల ప్రాంత ప్రజలు రెవెన్యూ పరంగా ఒక్కోప్రాంతానికి వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీంతో స్పందించిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ రెవెన్యూ డివిజన్ విషయమై రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి లేఖ రాయనున్నట్లు, తద్వారా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు హామీనిచ్చారని ఆయన తెలిపారు.

కూనంనేనికి సీపీఐ నాయకుల వినతి

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశం ప్రస్తావించడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డిదృష్టికి ఈప్రాంత ప్రజల ఇబ్బందులు వివరించిలని కోరుతూ సీపీఐ నేత, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు శుక్రవారం చేర్యాల సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, నాయకులు వినతి పత్రం అందించారు.

'ఉపాధ్యాయులకు ఈఎల్‌లు ఇవ్వరా?'

- డీఈవోకు టీపీటీఎఫ్ వినతి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఎర్న్‌డ్ లీవ్స్ (ఈఎల్స్) మంజూరు చేయాలని టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు చిట్యాల విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. సిద్దిపేట విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డికి టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సామాజిక సర్వేలో భాగంగా డేటా ఎంట్రీ నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసినవారిలో జిల్లా కార్యదర్శులు శివాజీ, సత్యకృష్ణ, బాల్‌రాజు ఉన్నారు.

ప్రాజెక్టులపై అవగాహన లేదు

- బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి


గజ్వేల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులపై సీఎం, మంత్రులకు అవగాహన లేదని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొండపోచమ్మసాగర్ గురించి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఎన్నో జిల్లాల రైతులకు, ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చేవిధంగా రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారని, కొండపోచమ్మసాగర్ రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఉండడంతో గ్రావిటీ ద్వారా నీటిని తరలించవచ్చన్నారు. ఆయనవెంట మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, బీఆర్‌ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు బెండే మధు, నవాజ్ మీరా, నాయకులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

అంకితభావంతో విధులు నిర్వహించాలి

- సిద్దిపేట ఏసీపీ మధు



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ మధు

సిద్దిపేట క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో విధులు నిర్వహించాలని సిద్దిపేట ఏసీపీ మధు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నమోదవుతున్న కేసుల గురించి, దొంగతనాల నివారణ గురించి పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది తరచుగా కేడీలు డీసీలు సస్పెక్ట్‌లపై నిఘా ఉంచాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని, ఓపికగా వారి సమస్యలు విని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, ఎస్‌ఐలు కనకయ్య, కొమురయ్య, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప దీక్షను విజయవంతం చేయాలి

- మద్దూరు మండల జేఏసీ కన్వీనర్ రామదుగు బాల్‌రాజ్



చేర్యాల: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 30న చేర్యాల మండలంలో నిర్వహించే ప్రజా సంకల్ప దీక్షను విజయవంతం చేయాలని మండల జేఏసీ కన్వీనర్ రామదుగు బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. మద్దూరు మండల కేంద్రంలో ప్రజా సంకల్ప దీక్ష వాల్‌పోస్టర్‌ను చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షౌకత్‌అలీ, మాజీ ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి, మద్దూరు, దూళిమిట్ట మడలాల పార్టీ అధ్యక్షులు మేక మల్లేశం, కోల స్వాయిలు, ప్రధాన కార్యదర్శి పూట్ల శ్రీధర్‌రెడ్డి, కో కన్వీనర్ పాకాల ఇసాక్, కో కన్వీనర్ ఉదయ్‌రెడ్డి పాల్గొన్నారు.

- చేర్యాల: ప్రజాసంకల్పదీక్షను విజయవంతం చేయాలని రెవెన్యూ డివిజన్ జేఏసీ కన్వీనర్ చెరుకు రమణారెడ్డి అన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల చంద్రశేఖర్, విష్ణుమూర్తి, లింగంపల్లి శ్రీనివాస్, రేష్మ, ర్యాకం ప్రభాకర్, నిమ్మ శ్రీకాంత్‌రెడ్డి, కనకయ్య, విజేందర్‌రెడ్డి, పుట్ట రమేశ్, ఏర్పుల రాజు, స్వాములపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

హుస్నాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీ నుంచి 29 వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని మహసముందులో జరిగే అండర్ -14 జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఏడోతరగతి విద్యార్థి గౌరవేని అశ్వంత్ ఎంపికైనట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు హుస్నాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అశ్వంత్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు..



నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన అనన్య, చైతన్య

మిరుదొడ్డి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన అనన్య, చైతన్య అనే విద్యార్థులు అండర్ 17 రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్‌మోహన్ రావు, పీఈటీ నరేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన నెట్‌బాల్‌లో పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి నెట్ బాల్‌పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయబృందం అభినందించింది.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

గజ్వేల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ కార్యశాలలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పాలన మాదిరిగానే కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదన్నారు. ఆయనవెంట బీజేపీ రాష్ట్ర నాయకులు ఎరుపుల వెంకటరమణ, పూదరి నందన్‌గౌడ్, యెల్లు రాంరెడ్డి, బీజేపీ మెదక్ పార్లమెంట్ కో-కన్వీనర్ నలగామ శ్రీనివాస్, బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు కుడికియాల రాములు, బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శివకుమార్, సిద్దిపేట జిల్లా కార్యదర్శి శశిధర్‌రెడ్డి, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- డీసీవో నాగేశ్వరరావు



ములుగు: కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీవో నాగేశ్వరరావు

ములుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని డీసీవో నాగేశ్వరరావు అన్నారు. ములుగు మండలంలోని నర్సాపూర్‌లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అసిస్టెంట్ రిజిస్ట్రార్ రఘోత్తంరెడ్డి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రవితో కలిసి సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీవో నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనవెంట పీఏసీఎస్ సీఈవో రమేష్ బాబు, ఏఈవో నివేదిత, సెంటరి ఇన్‌చార్జి అశోక్ ఉన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

కోహెడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరి కియ్యలను కాల్చవద్దని, అలా చేయడం వల్ల భూసారం దెబ్బతింటుందని వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్ అన్నారు. మండలంలోని కూరెళ్ల, పరివేద, శనిగరం గ్రామాల్లో వరికొయ్యలను కాల్చడం వల్ల కలిగే నష్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిప్పుతో భూసారం దెబ్బతింటుందని, భవిష్యత్తులో పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

- పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ

సిద్దిపేట కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు, సరెండర్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రాసేనా రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా పీఆర్టీయూశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఖజానా అధికారి చందునాయక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సుదీర్ఘ కాలంగా ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ముత్యాల సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి, వంగ వెంకట్రామిరెడ్డి, వంటేరు సత్యనారాయణ రెడ్డి, ఎర్ర పార్థసారథి, పుల్లగూర్ల రాంచంద్రారెడ్డి, తీగుల్ల లింగం, లచ్చిరెడ్డి, కనకారెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

మల్లన్నసాగర్‌పై సస్పెన్స్

5వ పేజీ తరువాయి



మల్లన్నసాగర్ పునరావాస కాలనీ

తమ భవిష్యత్తు ఎంటని ఆందోళన చెందుతున్నారు. ఈనెలాఖరున ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేయనున్నారు. ఈసారైనా మార్గదర్శకాలు విడుదల అవుతాయో లేదోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఆదేశాలు రాలేదు: డీపీవో దేవకీదేవీ

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలతో పాటు గౌరవెల్లి గ్రామపంచాయతీ విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. సిద్దిపేట రూరల్ మండలంలోని గ్రామపంచాయతీల విషయంలో టెక్నికల్ సమస్య ఏర్పడి పెండింగ్‌లో పెట్టాం. ఈ విషయమై కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి చూస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

- సిద్దిపేట ఏడీఏ పద్మ

చిన్నకోడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని సిద్దిపేట ఏడీఏ పద్మ అన్నారు. చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లోని ఓ రైతుకు చెందిన ఆయిల్‌పామ్ తోటలో శుక్రవారం పలువురు రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆయిల్ పామ్ పంటను చీడ, పీడలు చాలా తక్కువగా ఆశిస్తాయని, ప్రకృతి వైపరీత్యాలను కూడ తట్టుకుంటుందన్నారు. అంతకుముందు ఉద్యానశాఖ అధికారి బాలాజీ ఆశాఖ నుంచి వచ్చే సబ్సిడీల గురించి రైతులకు వివరించారు. పలువురు రైతులు అడిగిన సందేహలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏవో జయంత్‌కుమార్, ఏఈవో ప్రశాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

- దౌల్తాబాద్: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందని దుబ్బాక ఉద్యానవన శాఖ హెచ్‌వో రమేష్, వ్యవసాయశాఖ అధికారి స్వాయి కిరణ్, పేర్కొన్నారు. మండల పరిధిలోని దొమ్మాట క్లస్టర్ రైతు వేదికలో శుక్రవారం ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగు యజమాన్య పద్ధతులు ఉద్యానవన శాఖ అందించే రాయితీలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో సంతోష్‌కుమార్, పెడ్ క్షేత్ర స్థాయి అధికారి ఆంజనేయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

- గజ్వేల్: రైతులు లాభదాయక పంటల వైపు మళ్లాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి రాధిక, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, కీటకశాస్త్ర నిపుణులు డాక్టర్ రవి కోరారు. గజ్వేల్ పట్టణంలోని రైతు వేదికలో శుక్రవారం అధిక సాంద్రత పత్తి, ఆయిల్ పామ్‌లో అంతరపంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో చీడపీడల యాజమాన్యం గురించి చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పల్లవి, గజ్వేల్ ఏడీఏ బాబునాయక్, వ్యవసాయ విస్తరణాధికారులు జ్యోతి, కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు: ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ పద్మ